సాక్షి అనకాపల్లి

7

ఆదివారం । 16 । జూలై । 2023



న్యూస్‌రీల్

యలమంచిలిలో జాబ్‌మేళా రేపు

యలమంచిలి: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న వసుధ ఫార్మా కంపెనీ యాజమాన్యం పరవాడ,అచ్యుతాపురాల్లో ఉన్న తమ కంపెనీ యూనిట్లలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బీఎస్సీ(కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) విద్యార్హతగల అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎంపికైన బీఎస్సీ అభ్యర్థులకు సంవత్సారానికి రూ.2.12లక్షలు, ఎమ్మెస్సీ అభ్యర్థులకు రూ.2.48 లక్షల వేతనం, ఉచిత భోజనం, వసతి, ప్రయాణ సౌకర్యాన్ని కంపెనీ కల్పిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల ఫిజిక్స్ లెక్చరర్,జేకేసీ కోఆర్డినేటర్ కె.వెంకన్న (ఫోన్ నంబర్9542135995)ను సంప్రందించాలని తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తం



కాపుశెట్టివానిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

తుమ్మపాల: పల్లెల్లో ఇంటి వద్దే వైద్యసేవలు అందించే విధంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు జరుగుతోందని, జ్వరం, దగ్గు వంటి సాధారణ వ్యాధుల పట్ల కూడా ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. మండలంలో కాపుశెట్టివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఈ–ఆశా యాప్ వినియోగం, ఎన్‌సీడీ–సీడీ సర్వే, మందుల పంపిణీ పై ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి మందులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నుస్రత్ సమీమ్, ఏఎన్ఎం సుగుణ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘ ఎన్నికల బరిలో 20 మంది

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు నిలిచారని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ ఉపసంహరణ గడువు కాగా.. ఎవరూ తమ నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకోలేదని పేర్కొన్నారు. నామినేషన్ వేసిన అక్కరమాని పద్మ, ఉరికూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, గుడ్ల విజయసాయి, చల్లా రజని, పీలా లక్ష్మీసౌజన్య, బట్టు సూర్యకుమారి, బల్ల లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, గోడి విజయలక్ష్మి, నొల్లి నూకరత్న, పిసిని వరహా లక్ష్మీనరసింహ, పిల్లా మంగమ్మ, బల్ల శ్రీనివాసరావు, బొమ్మిడి రమణ, మద్దెల రామలక్ష్మి, ముక్కా శ్రావణి, శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు పోటీలో ఉన్నట్లు చెప్పారు. మొత్తం 10 స్థానాలకు ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలింగ్ నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటిస్తామని వెల్లడించారు.

వైఎస్సార్ స్ఫూర్తి.. సచివాలయ కీర్తి

- గాంధీజీ బాటలో గ్రామ స్వరాజ్యం వైపు అడుగులేయించిన రాజన్న
- గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ఆయన కలల్ని నిజం చేసిన సీఎం వైఎస్ జగన్
- మాడుగుల నియోజకవర్గంలో మహానేతను స్మరించుకుంటున్న ప్రజలు
- ఆయన గుర్తుగా సచివాలయాల వద్ద విగ్రహాల ఏర్పాటు

పల్లెలు పచ్చగా ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుంది.. రైతు ఆనందంగా ఉంటేనే ప్రజల కడుపు నిండుతుంది.. పేదల ముఖాల్లో నవ్వులు విరబూస్తేనే అది నిజమైన సువర్ణపాలన అవుతుంది.. ఇదే వైఎస్సార్ నమ్మిన సిద్ధాంతం. ఆయన పాలన ఆ దిశగానే నడిచింది. ఆయన హఠాన్మరణంతో తొమ్మిదేళ్లపాటు రాష్ట్రం అతలాకుతలమైంది. కష్టాలు, కన్నీళ్లు, అవినీతి, అరాచకం రాజ్యమేలాయి. సామాన్యుడిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఆ చీకటి రోజులకు చరమగీతం పాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. తండ్రి స్ఫూర్తితో ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టారు. పథకాలు అమలు చేశారు. దాంతో సంక్షేమం ఇంటింటికీ చేరి బతుకులపై ఆశలు కల్పించింది. దీనంతటికీ కారణం సచివాలయ వ్యవస్థ. అధికార వికేంద్రీకరణకు సచివాలయాలు మారుపేరుగా నిలిచాయి. బడుగు వర్గాలకు దేవాలయాలు అయ్యాయి. అందుకే స్ఫూర్తి ప్రదాత రాజన్నకు మాడుగుల నియోజకవర్గంలో ఘనమైన గౌరవం అందిస్తున్నారు. ప్రతి సచివాలయం వద్ద ఆయన విగ్రహాన్ని పెట్టుకొని పూజిస్తున్నారు.

సాక్షి, అనకాపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే గ్రామ సచివాలయ వ్యవస్థ ఆవిర్భవించింది. మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యపాలనే లక్ష్యంగా.. తన తండ్రి ఆశయాన్ని నిజం చేసేలా.. గ్రామాల చెంతకే ప్రజా పాలన తీసుకురావాలనే లక్ష్యంతో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే అదే ఏడాది గాంధీ జయంతి రోజున గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. లక్షల మంది యువతను ఉద్యోగులుగా నియమించి.. గ్రామ సచివాలయాల ద్వారా పరిపాలనకు శ్రీకారం చుట్టారు. దీనంతటికీ స్ఫూర్తిని అందించిన వైఎస్సార్ విగ్రహాన్ని మాడుగుల నియోజకవర్గంలో ప్రతి సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 78 గ్రామ సచివాలయాలు ఉండగా.. అందులో 21 చోట్ల వైఎస్సార్ విగ్రహాలను నెలకొల్పారు. వీటిలో 15 విగ్రహాలను వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. మిగిలిన 57 సచివాలయాల్లో మూడు నెలల్లోగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రాజన్న అడుగులు

ముఖ్యమంత్రిగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదోడి గుండె చప్పుడు విని అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. రైతులకు ఉచిత విద్యుత్, రుణ మాఫీ, పావలా వడ్డీ రుణాలు, విద్యుత్ బకాయిల మాఫీ, డ్వాక్రా రుణ మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, 104 అంబులెన్స్ సేవలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారు. ఆనాడే గ్రామస్వరాజ్య స్థాపనకు పునాది వేశారు. ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ కలను పూర్తిగా సాకారం చేశారు.



తాటిపర్తిలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ శ్రేణులు (ఫైల్)



దేవరాపల్లి మండలం తెనుగుపూడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహం

ఒక్కో విగ్రహానికి రూ.1.5 లక్షల ఖర్చు

మహానేత వైఎస్సార్ హయాంలో లబ్ధి పొందిన ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తోంది. ప్రతి సచివాలయం ముందు చిరునవ్వుతో ఉండే మహానేత విగ్రహం ఉండాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఒక్కో విగ్రహం తయారీకి లక్షా 50 వేల రూపాయలు వెచ్చిస్తున్నారు.

వివరాలు ఇలా..

- మాడుగుల మండలంలో 23 గ్రామ సచివాలయాలుండగా 3 గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించారు. గతంలోనే ఒక విగ్రహాన్ని నెలకొల్పారు.
- చీడికాడ మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో 3 గ్రామ సచివాలయాల వద్ద వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించారు.
- దేవరాపల్లి మండలంలో 20 గ్రామ సచివాలయాలు ఉంటే 14 చోట్ల వైఎస్సార్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. అందులో 9 విగ్రహాలు ఆవిష్కరించారు.
- కె.కోటపాడు మండలంలో 22 గ్రామ సచివాలయాలుండగా అందులో రెండుచోట్ల ఏర్పాటు చేశారు.

స్వచ్ఛందంగా విగ్రహాల ఏర్పాటు



మహానేత వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదోడి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తండ్రి ఆలోచనలకు మరింత పదునుపెట్టి.. వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను సృష్టించారు. నాలుగేళ్ల పాలనలో గ్రామస్వరాజ్య పాలన తీసుకొచ్చారు. అలాంటి గ్రామ స్వరాజ్యానికి మూలాధారమైన మహానేతను ప్రతి సచివాలయం వద్ద నియోజకవర్గ ప్రజలు స్మరించుకుంటున్నారు. మహానేత వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు వారే స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మాడుగుల నియోజకవర్గంలో ప్రతి సచివాలయం వద్ద రూ.1.5 లక్షల విలువతో వైఎస్సార్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

బార్క్ నిర్వాసితులకు త్వరలోనే పరిహారం

- 580 మంది గుర్తింపు: ఎమ్మెల్యే కన్నబాబురాజు



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం (అనకాపల్లి): బార్క్ నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం సాధ్యమైనంత త్వరలోనే అందిస్తామని ఎమ్మెల్యే యు.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. దోసూరు, తంతడి గ్రామాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలైన రైతులకు అందించే పరిహారం విషయంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 580 మంది నిర్వాసితుల్ని గుర్తించామన్నారు. ఎవరైనా అర్హులై ఉండి, జాబితాలో పేరు లేకుంటే తనను సంప్రదించాలని, రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేసి అర్హత ఉంటే పరిహారం అందిస్తారని తెలిపారు. సుమారు రూ.50 కోట్ల పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, పార్టీ నాయకుడు కోన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే బీపీటీ బియ్యం, కందిపప్పు

తుమ్మపాల: అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల పరిధిలో గల రేషన్ కార్డుదారులకు తక్కువ ధరకే బీపీటీ బియ్యం, కందిపప్పు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీటీ బియ్యం కేజీ రూ.46లకు, కందిపప్పు కేజీ రూ.137లకు విక్రయిస్తారని, ఒక రేషన్ కార్డుపై 10 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు అందిస్తారని చెప్పారు. ఈనెల 16వ తేదీ నుంచి శ్రీ వెంకటేశ్వర ట్రేడింగ్ కంపెనీ (యలమంచిలి), ఎస్ఎస్ఎస్ స్టోర్స్ (నర్సీపట్నం), సుటాపల్లి బంగార్రాజు షాపు (నర్సీపట్నం), కొప్పాక శ్రీనివాసరావు దుకాణం (అనకాపల్లి)లో ఈ సరకులు లభిస్తాయన్నారు.

అన్ని స్థానాల్లో గెలవాల్సిందే..

- 19న జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలు
- కార్పొరేటర్లకు మాక్ పోలింగ్ నిర్వహించాలి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి దిశానిర్దేశం



బరిలో నిలిచిన అభ్యర్థులతో వైవీ సుబ్బారెడ్డి తదితరులు

దాబాగార్డెన్స్ (విశాఖ): 'జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అన్ని స్థానాల్లో గెలవాలి. పోలింగ్‌లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా.. మాక్ పోలింగ్ నిర్వహించి కార్పొరేటర్లకు అవగాహన కల్పించాలి'అని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మేయర్, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్‌లీడర్, సీనియర్ కార్పొరేటర్లకు సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, మేయర్, డిప్యూటీ మేయర్లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 19న జరిగే పోలింగ్‌లో పార్టీ నుంచి బరిలో ఉన్న 10 మంది కార్పొరేటర్లను స్థాయీ సంఘ సభ్యులుగా ఎన్నుకోవాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ సమన్వయకర్తలు కె.కె.రాజు, అక్కరమాని విజయనిర్మల, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, అభ్యర్థులు అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకూటి నారాయణ రావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్లా లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీ సౌజన్య, సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థపై ప్రశంసలు

వలంటీర్ వ్యవస్థను యావత్ దేశం మొత్తం ప్రశంసిస్తోందని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ప్రధాని మంత్రి మోదీ కూడా కొనియాడారని చెప్పారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా వలంటీర్లు పని చేస్తున్నారని, జన్మభూమి కమిటీల్లా వలంటీర్ వ్యవస్థ దోపిడీలకు పాల్పడడం లేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని, వలంటీర్ వ్యవస్థపై వైఎస్సార్ సీపీ బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. వలంటీర్ల వ్యవస్థపై అవగాహన లేకుండా పవన్ కల్యాణ్, చంద్రబాబు మాట్లాడుతున్నారని.. చంద్రబాబు స్క్రిప్ట్ మేరకే పవన్ వలంటీర్లు, సీఎంపై విమర్శలు చేస్తున్నారని వై.వి.సుబ్బారెడ్డి మండిపడ్డారు.

వికేంద్రీకరణతో పథకాల అమలు వేగవంతం



సమావేశంలో పాల్గొన్న ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- ఎంపీ సత్యవతి

తుమ్మపాల: జిల్లాల వికేంద్రీకరణతో సంక్షేమ పథకాల అమలు వేగవంతమయిందని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేసి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. పీఎం కౌశల్ వికాస్ యోజన, స్వచ్ఛభారత్, మాతృత్వ వందనయోజన, జననీ సురక్ష యోజన, ఆదర్శ గ్రామ యోజన తదితర పథకాలు సక్రమంగా అమలు జరుగుతున్నాయని తెలిపారు. పారిశ్రామికంగా జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందని, యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు రానున్నాయని చెప్పారు. మాతృత్వ వందనయోజనలో జిల్లాలో 32వేల మంది గర్భిణులకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఆదర్శ గ్రామాలను తయారు చేయాలని సూచించారు. పీఎం ఆవాస్‌యోజనలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో అనకాపల్లి, కశింకోట, యలమంచిలి రైల్వేస్టేషన్లను మరింత అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసుకుంటూ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నిర్మాణాలు వేగవంతం చేసినట్టయితే, మరిన్ని నిర్మాణాలకు నిధులు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సందీప్, సీపీవో రామారావు, ఇరిగేషన్ ఎస్ఈ వీరునాయుడు, డీఎంహెచ్‌వో హేమంత్, డీసీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్, హౌసింగ్ పీడీ రమామణి, వ్యవసాయశాఖ జేడీ మోహనరావు, డీఆర్‌డీఏ పీడీ డైజీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీధర్, ఎల్‌డీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- సెర్ప్ సీఈవో ఇంతియాజ్

అనకాపల్లి రూరల్: మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాలు కల్పిస్తున్నట్టు సెర్ప్ సీఈవో ఇంతియాజ్ చెప్పారు. పట్టణంలోని కేఎస్ఆర్ పేట, బవులువాడ గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో శనివారం రాత్రి ఆయన పాల్గొన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా నెలకొల్పిన చిరుధాన్యాలు, బెల్లం యూనిట్లను పరిశీలించారు. స్త్రీనిధి ఉన్నతి ద్వారా పలువురు మహిళలు ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను పరిశీలించిన ఆయన మహిళా లబ్ధిదారుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్కెటింగ్ మెలకువలను నేర్పుతామని చెప్పారు. ఆధునిక అభిరుచులకు అనుగుణంగా వారి ఉత్పత్తులకు డిజైనింగ్, ప్యాకింగ్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. మహిళా సాధికారతకు అన్ని రకాలుగా ప్రభుత్వ సహాయం అందజేస్తామన్నారు. గ్రీన్ మిలీనియం అనకాపల్లి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. కొందరు మహిళలకు పెరటికోళ్లను అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, సెర్ప్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.



బవులవాడ చిరు ధాన్యాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న సెర్ప్ సీఈవో ఇంతియాజ్


మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, ఆరోగ్యం

- సినీ నటుడు సుమన్

అనకాపల్లి రూరల్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ సినీ నటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులంతా చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా మానసిక ఉల్లాసం పొందగలుగుతారని, తద్వారా అనేక రంగాల్లో రాణించే అవకాశముందన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని వి.వి.రమణ రైతుభారతి ఆడిటోరియంలో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన పీఆర్‌కే కప్ సౌంతిండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ఆపదనైనా ఎదుర్కొగల ఆత్మవిశ్వాసం మార్షల్ ఆర్ట్స్ ద్వారా పెంపొందుతుందన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో ఎంతో ప్రావీణ్యం ఉన్న స్థానిక క్రీడాకారులు మరింత రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం సుమన్‌ను దాడి రత్నాకర్, కరాటే అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా సౌజన్య, వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీ నటుడు సుమన్, దాడి రత్నాకర్



క్లుప్తంగా

రౌడీ షీటర్‌పై మహిళ ఫిర్యాదు

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన రౌడీ షీటర్ మల్లేటి రమణపై అదే గ్రామానికి చెందిన గరగా సత్యవతి అనే మహిళ రావికమతం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. తన ఇంటి పక్కన ఒకటింప్పావు సెంటు భూమిని కొత్తకోట గ్రామానికి చెందిన మరువాడ అర్జున వద్ద 19 ఏళ్ల క్రితం తన భర్త మాణిక్యం కొనుగోలు చేశారని, తదనంతరం కొనుగోలు చేసిన తన భర్త, అమ్మిన అర్జున మృతి చెందగా ఆ భూమి అప్పటి నుంచి తన స్వాధీనంలో ఉందని తెలిపారు. ఆ భూమిని వేరొకరికి విక్రయించుకోగా ఇపుడు మల్లేటి రమణ, మరువాడ సత్యం వచ్చి గొడవ చేస్తున్నారని తెలిపారు. అధికారులకు తప్పుడు పిర్యాదు చేయడంతో రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు వద్ద విచారణకు హాజరై వస్తుండగా రౌడీ షీటర్ మల్లేటి రమణ తనతో దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడాడని, అట్రాసిటీ కేసు పెట్టిస్తానని బెదిరించాడని అతనిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావును సంప్రదించగా ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తుమ్మపాల : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గ్రామీణ ఎస్‌ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో కె.ఎన్.ఆర్.పేట గ్రామానికి చెందిన దొమ్మేతు అప్పారావు(72)ను ఈనెల 7వతేదీన అదే గ్రామంలో మెయిన్‌రోడ్డుపై నడుస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో అప్పారావు తీవ్రంగా గాయపడడంతో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

హిస్టరీ షీటర్లపై నిఘా

- పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయండి
- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: నేర ప్రవత్తి కలిగిన హిస్టరీ షీటర్ల కదలికలపై నిఘా పెంచాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం రాత్రి అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో పోలీసు సిబ్బందితో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ప్రాపర్టీ, పోక్సోయాక్ట్, 174 సీఆర్పీసీ, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన సమీక్షించి ఆయా కేసుల్లో దర్యాప్తు, పెండింగ్‌లో ఉండటానికి కారణాలపై ఆరా తీశారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ హిస్టరీ షీటర్లకు భయపడే ప్రజలను అప్రమత్తంగా చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రాపర్టీ కేసుల దర్యాప్తులో ముఖ్యంగా సాంకేతిక సాక్ష్యాల సహాయంతో దర్యాప్తు అధికారి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టడం ద్వారా నిందితులకు శిక్ష అమలవుతుందన్నారు. ఆస్తి, దొంగతనాల కేసుల నివారణకు రాత్రి/పగలు గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. ప్రధానంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్‌హౌస్ మానటరింగ్ సిస్టం)పై అవగాహన పెంచడం ద్వారా ఇల్లు విడిచి దూర ప్రాంతాలకు వెళ్లేవారికి సూచనలు, సలహాలిస్తూ ఆ ప్రాంతంలో గస్తీని ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి కేసుల్లో శిక్ష శాతం పెంచేందుకు దర్యాప్తులో ఉపకరించే సూచనలు, తలెత్తే అనుమానాలపై పోలీసు అధికారుల సందేహాలను అనకాపల్లి పదో అడిషినల్ జడ్జి కోర్టు అదనపు పీపీ వడ్డాది వెంకటరావు నివృత్తి చేశారు. ఐదు కేసుల్లో ముద్దాయిలకు జీవిత ఖైదీ శిక్ష పడేటట్లు వాదనలు వినిపించిన విశాఖ 12వ అడిషనల్ జడ్జి కోర్టు ఏపీపీ వి.దేవానంద్, వడ్డాది వెంకటరావులను ఎస్పీ ఘనంగా సత్కరించారు. అంతకుముందు 56 మంది అధికారులు, సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ(క్రైం) పి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, అనకాపల్లి, పరవాడ, డీఎస్పీ వి.సుబ్బరాజు, మళ్ల మహేశ్వరరావు, కె.వి.సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

22 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు

- మరొకరు పరార్

చోడవరం రూరల్: ఒరిస్సా రాష్ట్రం దగురుబిల్లి గ్రామంలో కొనుగోలు చేసి చోడవరం మీదుగా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్న 22 కేజీల గంజాయితో చోడవరం పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. మరొకరు పరారయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు. శనివారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ గొడ్డలిశర్ల గ్రామానికి చెందిన వంతల దొరబాబు, తమిళనాడు రాష్ట్రం అరక్కోణం జిల్లా సోలంగిర్ గ్రామానికి చెందిన షణ్ముగం అజయ్‌కుమార్ అలియాస్ గోపాల్, కిశోర్ అనువారు చోడవరం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద 22 కేజీల గంజాయితో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా చోడవరం ఎస్‌ఐ తన సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. వారి వద్ద గంజాయి పట్టుబడడంతో షణ్ముగం అజయ్‌కుమార్, వంతల దొరబాబులను అదుపులోకి తీసుకోగా కిషోర్ అనే వ్యక్తి పరారయ్యాడు. పట్టుబడ్డ ఇద్దరిని అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతులు


రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: ఎం.కోటపాడు వద్ద అధ్వాన రోడ్డుకు మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. మాడుగుల–వడ్డాది మార్గంలో ఎం.కోటపాడు వద్ద పెద్ద పెద్ద గొయ్యలు పడడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాలను గుర్తించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మరమ్మతుల బాధ్యతలను తహసీల్దార్ పీవీ రత్నంకు అప్పగించారు. ఈ పనులను శనివారం తహసీల్దార్‌తోపాటు ఓఎస్డీ పోలినాయుడు, సర్పంచ్ గంగాధర్ పరిశీలించారు.

వాహనాల వేలంతో రూ.50 వేల ఆదాయం


మాడుగులలో వేలం వేస్తున్న సిబ్బంది

మాడుగుల: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ స్టేషన్ పరిధిలో గతంలో సారా, తదితర కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం వేలం వేశారు. తద్వారా రూ.50,150 ప్రభుత్వ ఖజానాకు జమ అయిందని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సింహాద్రి తెలిపారు. ఈ వాహనాల్లో రెండు మోటారు సైకిళ్లు, ఒక ఆటో, స్కూటర్, ఇతర వాహనాలు ఉన్నాయన్నారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ అనకాపల్లి జె. రవికుమార్ సారధ్యంలో ఈ వేలం పాట నిర్వహించారు.

ఖననం చేసిన అనాథ శవానికి పోస్టుమార్టం

- మార్చురీలోనే శ్రీను మృతదేహం

అనకాపల్లి టౌన్: మునగపాక మండలం తోటాడ గ్రామానికి చెందిన పాలిశెట్టి శ్రీను (55) మృతదేహంగా భావించి.. అతని కుటుంబ సభ్యులు ఖననం చేసిన అనాథ శవాన్ని అధికారులు శనివారం వెలికితీశారు. దానికి పోస్టుమార్టం జరిపారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో మృతదేహాలు తారుమారైన విషయం తెలిసిందే. మునగపాక మండలం తోటాడ గ్రామానికి చెందిన పాలిశెట్టి శ్రీను మృతదేహానికి బదులు సబ్బవరం మండలం అసకపల్లి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని శ్రీను కుటుంబసభ్యులకు అప్పగించారు. గుర్తు తెలియని మృతదేహం కోసం సబ్బవరం పోలీసులు వైద్యాలయానికి రావడంతో.. పొరపాటు బయటపడింది. దీంతో హుటాహుటిన పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ తోటాడ గ్రామానికి పరుగులు తీశారు. ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీశారు. ఆ మృతదేహానికి శనివారం శ్మశానంలోనే పోస్టుమార్టం నిర్వహించి, బంధువులెవరూ రాకపోవడంతో తిరిగి ఖననం చేశారు. శ్రీను మృతదేహం కోసం కుటుంబ సభ్యులు రాకపోవడంతో ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీలో భద్రపరిచామని వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ చెప్పారు.

రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు

- గున్నెంపూడిలో పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


గున్నెంపూడిలో రైతులకు పరికరాలు అందిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పలు రకాల వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. మండలంలోని గున్నెంపూడిలో డ్వామా ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ పథకంలో ఎంపికైన 32 మంది రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం వాటర్‌షెడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ, ఓసీలకు 80 శాతం రాయితీపై రైతులకు నీటిఇంజిన్లు, గడ్డి కట్టర్లు, టార్పాలిన్లు తదితర పరికరాలను అందిస్తుందన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో గున్నెంపూడి, రాజాం, పెదమదీన, ఆర్. శివరాంపురం, ఆర్. భీమవరం, మల్లాం, తైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి, పెదపూడి, కందిపూడి, కొండెంపూడి గ్రామాలను వాటర్‌షెడ్ పథకంలో చేర్చామని డ్వామా పీడీ ఏ శరత్ తెలిపారు. ఆయా గ్రామాల రైతులు రాయతీపై అందించే పలు రకాల పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ ముచ్చకర్ల హరిణి అప్పారావు, ఎంపీటీసీ సుశీల వెంకట రమణ, రైతు సంఘ నాయకులు తాతారావు, కాసులమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ అందించడమే లక్ష్యం

- జగనన్న సురక్షలో ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి


లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి, డాక్టర్ రామ్మూర్తి

తుమ్మపాల: ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి అన్నారు. పట్టణంలోని గాంధీనగరం ఒకటో గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ రామ్మూర్తితో కలిసి లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అందేలా చేయడమే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సైతం మేలు చేకూర్చేలా ఆదాయ, కుల ధ్రువపత్రాలతోపాటు భూమి పట్టాలు, రేషన్ కార్డులు, ఆధార్ సవరణలు వంటి సేవలను ఉచితంగా అందిస్తుందన్నారు. నెల రోజుల పాటు ప్రజలు వీటిని పొందవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొణతాల మురళీ, జాజుల రమేష్, గౌపూరి రాజు, డీటీ శ్రీరామూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు నూకాంబికకు శాకంబరి అలంకరణ

తుమ్మపాల: ఉత్తరాంధ్రజలవేల్పు నూకాంబిక అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించనున్నట్టు కార్యనిర్వాహక అధికారి బండారు ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

నేడు మోదకొండమ్మ ఉత్సవం



కశింకోటలోని మోదకొండమ్మ

కశింకోట: శారదానది అవతల పొలాల్లో వెలసి ఉన్న మోదకొండమ్మ ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, రైతు సంఘం అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అమ్మవారి ఉత్సవం జరిపితే సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంత రైతులు భావిస్తారు.

సీహెచ్ఎన్ అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం రేపు

అనకాపల్లి రూరల్: మండలంలోని సీహెచ్ఎస్ అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.వి.నరసింహరావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని, సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

ముగిసిన మిషన్ లెర్నింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

తుమ్మపాల: పట్టణంలోని 'డైట్' కళాశాలలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహించిన మిషన్ లెర్నింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఆన్‌లైన్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, పైథాన్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్లు శ్రీనివాస్, రాధాకృష్ణ, రామమూర్తి, రామలింగస్వామి, సుజిత్‌దాస్, రవికుమార్, సుశీల్‌కుమార్, కర్నూల్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 09 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,920	3,920

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-1
ఆదిపురుష్	: సత్యనారాయణ స్క్రీన్-2
రంగబలి	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
నాయకుడు	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-27 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్ 2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 373 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 337 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

పల్లె ముంగిట ఆధునిక వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. మండల కేంద్రాలకు పరిమితమైన ఆస్పత్రులను మారుమూల ప్రాంతాలకు విస్తరించడంతో పాటు ఆధునిక వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఎక్కడికో వెళ్లాల్సిన పని లేకుండా...అక్కడికక్కడే వైద్య సేవలు పొందేలా ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. వ్యాధి ఏదైనా వైద్యం పల్లెలోలభించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ క్లినిక్‌ల ద్వారా సేవలందిస్తున్నారు.

- అనకాపల్లి మండలంలో 23 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- ఉచితంగా 105 రకాల మందులు



గోపాలపురంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్

తుమ్మపాల : ప్రతి పల్లెలోనూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోంది. దగ్గరలోని పీహెచ్‌సీల వైద్యులు ఇకనుంచి నేరుగా గ్రామంలోకి వచ్చి సేవలు అందించనున్నారు. గ్రామంలో ఉండే వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, క్లినిక్‌ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. వీటి ద్వారా 108,104 వాహనాల నిర్వహిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇప్పటికే ఆస్పత్రికి వెళ్లలేని రోగుల ఇళ్లకు డాక్టర్లు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు.

23 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు

అనకాపల్లి మండలంలో మొత్తం 26 సచివాలయాల పరిధిలో మూడు పీహెచ్‌సీల ద్వారా 23 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో 12 సచివాలయాల పరిధిలో హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల గోపాలపురంలో హెల్త్ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ క్లినిక్ ద్వారా ఆ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. మరో మూడు సచివాలయాల పరిధిలో హెల్త్ సెంటర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన కేంద్రాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో ఏడు క్లినిక్‌లను ఏర్పాటు చేస్తుండగా ఇప్పటికే తగరంపూడి సచివాలయం ఆవరణలో కేంద్రంలో వైద్య సేవలందిస్తున్నారు. మిగిలిన చోట్ల భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో అనకాపల్లి మండలంలో నాలుగు గ్రామాలు ఉండగా సంపతిపురం గ్రామంలో హెల్త్ సెంటర్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన కేంద్రాల పనులు జరుగుతున్నాయి. త్వరితగతిన అన్ని కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తిచేసి ప్రజలకు వీటి ద్వారానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

105 రకాల మందులు ఉచితం

గ్రామ సచివాలయ పరిధిలో కనీసం 2 వేల నుంచి 3 వేల వరకు జనాభా కలిగిన గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఉంటుంది. ఈ క్లినిక్ ద్వారా 24 గంటలూ వైద్యసేవలు అందించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ, గ్రామ సచివాలయ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉచితంగా అందిస్తున్నారు. సుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల రక్తపరీక్షలు చేసేందుకు అత్యాధునిక కిట్లు ఏర్పాటుచేశారు. క్లినిక్‌ల పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించిన డాక్టర్లు 104 వాహనం ద్వారా వచ్చి వైద్యసేవలు అందిస్తారు.

ఇంటికే వద్దకే మందులు



నాకు వయస్సు మీదపడింది. దీనికి తోడు అనేక రకాల అనారోగ్య సమస్యలున్నాయి. కనీసం నడవడానికి కూడా కాళ్లు సహకరించడంలేదు. కాస్త ఇబ్బందిగా అనిపిస్తే మా ఊర్లోని వైద్య సిబ్బందికి సమాచారం ఇస్తే చాలు నేరుగా ఇంటికే వచ్చి పరీక్షలు చేసి మందులిస్తున్నారు. మా ఊర్లోనే ఆస్పత్రి నిర్మించారు. అందుబాటులో వైద్య సేవలు అందించడం చాలా ఆనందంగా ఉంది.

– వారిధి కోటేశ్వరరావు, రేబాక గ్రామం

గ్రామాల్లో మెరుగైన వైద్యం



అందరికీ మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం వినూత్న మార్పులు తీసుకొచ్చింది. ప్రతి పల్లెలోనూ వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఇప్పటికే గ్రామాల్లో వైద్య సిబ్బందిని నియమించి సచివాలయాల ద్వారా ప్రతి ఇంటికి వైద్యాన్ని చేరువ చేశాం. గర్భిణులు, వృద్ధులు, పిల్లలకు ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నాం.

–డాక్టర్ వాణి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు

కుళ్లు రాజకీయాలు చేస్తున్న బాబు, పవన్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్



మహిళకు బ్రోచర్ అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తుమ్మపాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలకభూమిక పోషిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలో 83వ వార్డు పరిధి ఉడ్‌పేటలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావులేకుండా సేవలందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు బురదజల్లడం మానుకోవాలన్నారు. సీఎం జగన్‌ను ఎదుర్కోలేకనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు కుళ్లురాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కష్టంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న తీరు పచ్చమీడియాకు కనిపించకపోవడం శోచనీయమన్నారు. ఎరెన్ని పన్నాగాలు పన్నినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ నాయుళ్లవీధి రహదారి విస్తరణకు సంబంధించిన ఇబ్బందులను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నాయుళ్లవీధి రహదారిని 100 అడుగుల రోడ్డుగా విస్తరించాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయించిందని, ఈ విస్తరణకు బదులు లక్ష్మీదేవిపేట రైల్వేపై ఓవర్ వంతెన పనులు పూర్తి చేయాలని మంత్రిని స్థానికులు కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. మెయిన్‌రోడ్డుపై బస్సులు పార్కింగ్ చేయడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని మరికొంతమంది మంత్రి దృష్టికి తీసుకురాగా సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను మంత్రి అమర్‌నాథ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పలు శాఖల అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని గ్రామాల్లోనూ రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. తుమ్మపాలలో కొణతాల వారి కల్యాణమండపం ప్రాంతంలో రూ.1.5 లక్షల వ్యయంతో డ్రైనేజీల నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో తుమ్మపాలలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎంకు అందరూ అండగా నిలవాలన్నారు. సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ చదరం చిన్న, దంతూలూరి కల్యాణ్‌బాబు, వార్డు మెంబర్లు కొణతాల చంటి, తర్ర సత్యారావు, వెలగా మోదినాయుడు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వద్దాది భారతీ అశోక్, రైతు నాయకులు పీలా బుజ్జి, సేవాదళ్ నాయకులు ఆర్టీసీ సత్యనారాయణ, పార్టీ నాయకులు ఆడారి సూరిబాబు, అనిల్, కొణతాల అర్జునాయుడు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు వాహనాల వేలం

అనకాపల్లి రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాలకు శనివారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ ఆవరణలో ఆ శాఖ అధికారులు వేలం వేశారు. రెండు స్కూటీలు, మూడు బైకులు, ఒక ఆటోకు నిర్వహించిన వేలం పాటలో సుమారు 25 మంది పాల్గొన్నారు. రూ.3 వేల ధరావత్తు చెల్లించిన వారిని వేలం పాటలో పాల్గొనేందుకు అనుమతించారు.

వాహనాల వేలం పాట ద్వారా రూ.1.97 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ జె.రవికుమార్ పర్యవేక్షణలో వేలంపాట జరిగింది. సీఐ సీహెచ్ జగన్నాథరాజు, ఎస్ఐ కె. శ్రావణి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గవర కులస్తుల సదస్సు

తుమ్మపాల: పట్టణంలో కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణమండపంలో అంతర్జాతీయ గౌరీఐక్యసేన ఆధ్వర్యంలో ఆదివారం గవర కులస్తుల సదస్సు నిర్వహించనున్నట్టు సేన చైర్మన్ ఆడారి ఉమాశంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గవరకులస్తులను బీసీ డి నుంచి బీసీ ఎ లోకి మార్పు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఖాళీలను భర్తీ చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

అనకాపల్లి రూరల్: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో డెత్, రిటైర్మెంట్, దీర్ఘకాలిక సెలవులకు సంబంధించి ఆ కుటుంబాల వారసులకు ఉద్యోగాలు కల్పించి, ఖాళీలను భర్తీ చేయాలని శనివారం అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ అనకాపల్లిని జీవీఎంసీలో జనాభాకు తగ్గ పారిశుధ్య సిబ్బంది లేరన్నారు. తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండలశాఖ ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, ఎ.బాలకష్ణ, వై.ఏసురాజు, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్, వాసు,నూకరాజు, బొమ్మల నాగరాజు, సత్యనారాయణ, గోవింద్, రమణమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ సిదిరెడ్డి సతీష్

కశింకోట: విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని విశాఖలోని మధురవాడ శాఖ యూనియన్ బ్యాంకు మేనేజర్ సిదిరెడ్డి సతీష్ తెలిపారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని బయ్యవరం హైస్కూలులో ప్రతిభావంతులైన నలుగురు విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. బయ్యవరానికి చెందిన సతీష్ తన తండ్రి సిదిరెడ్డి అప్పారావు తరఫున ఉరుగిటి కాసులమ్మకు రూ.5 వేలు, నగిరెడ్డి సందీప్‌కు రూ.3 వేలు, చందక పావనికి రూ.5వేలు, సీహెచ్.దినేష్‌కు రూ.3 వేల చొప్పున ప్రోత్సహక నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు పొందడానికి కృషి చేయాలన్నారు. హెచ్ఎం జి.వి.రమణ, ఉపాధ్యాయులు ఎస్.నాగేశ్వరరావు, ఎ. సరోజిని, ఎస్.రమేష్, పుష్పలత, ఎం.అప్పారావు, జి.ఎస్. రత్న కుమార్, ఎ. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి తాళ్లపాలెం హైస్కూల్ విద్యార్థి ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వానపల్లి లోహిత్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ చదివిన వానపల్లి లోహిత్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం విజయ లక్ష్మిసుమన్ తెలిపారు. ఈ సందర్భంగా లోహిత్‌కు హెచ్ఎంతో పాటు పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్ గోవింద, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, ఉపాధ్యాయులు

కశింకోట: రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు కశింకోటలో శనివారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వెలుగు శాఖ ఆధ్వర్యంలో స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవ హారం నిర్వహించి అక్కడ నుంచి సంతబయల మీదుగా రిక్షా స్టాండ్ వరకు ర్యాలీ జరిపారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట లక్ష్మి, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, ఏఎస్ఐ పి.సుధా, స్కూలు హెచ్ఎం ఎం.ఆర్.వి.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్కూలు పీడీ వి. ప్రభాకరరావు, ఆర్ఈసీఎస్ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రభాకర్, రవి, సీసీ సత్యనారాయణ, వివోఎలు రాము, ప్రసన్న, భారతి,పద్మావతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో అన్నదానం



ఉపమాక ఆలయంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వరుసగా రెండో శనివారం అన్న దానం కార్యక్రమం జరిగింది. కరోనా కారణంగా రెండేళ్ల పాటు నిలిపివేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ చొరవ, దాతల సహకారంతో తిరిగి గతవారం పునఃప్రారంభించారు. గతవారం స్వామివారి దర్శనానికి వచ్చిన సుమారు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ శనివారం సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ప్రధానార్చకులు ప్రసాద్ తెలిపారు. ఇటీవల శని, ఆదివారాల్లో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, పులిహోర ప్రసాదంతో పాటు, ప్రతి శనివారం అన్న సమారాధన నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు.

ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీసపాటి వేంకట నర్సింహచార్యులు, ఎన్‌సీహెచ్ శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు పాల్గొన్నారు. శనివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొండదిగువన వేణుగోపాలస్వామి సన్నిధిలోను, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు యానాద్రి అమ్మవారి పండగ



యానాద్రి అమ్మవారు

యలమంచిలి : అల్లూరి సీతారామరాజు కాలనీలో రైల్వే పట్టాల వద్ద వెలసియున్న యానాద్రమ్మ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిపించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఇక్కడ ఏటా ఆషాఢమాసం మూడో వారంలో యానాద్రి అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. యానాద్రమ్మ అమ్మవారి పండుగ మహోత్సవానికి జిల్లా నలుమూలలు నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద టెంట్లు, తాగునీటి సదుపాయం, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి ఎంతో మేలు

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తే ఎటువంటి దుష్ప్రభావం లేని ఆహారోత్పత్తి జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హిమ సుందర్ అన్నారు.అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన వరి నారుని పెంచుకోవాలని సూచించారు.

పేదలకు బియ్యం పంపిణీ



రత్నాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. కస్పావీధిలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి,జేజుబాబు ఆధ్వర్యంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ చైర్మన్ దాడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. దివ్యాంగులకు బియ్యం పంపిణీ చేశారు.

మెగా వైద్య శిబిరం

అనకాపల్లి రూరల్: రాజుపాలెంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డీసీఎంఎస్ సభ్యులు రేబాక మధుబాబు తదితరులు పాల్గొన్నారు. రత్నాకర్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నేతలు పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తూరు పంచాయతీలో శానిటేషన్ సిబ్బందికి స్వీట్లు, బిస్కట్లు, డ్రింక్‌లు పంపిణీ చేశారు. కాకరాపల్లిలోని ప్రేమసమాజం, వద్దాశ్రమంలో నెల రోజులకు సరిపడే సరకులను పంపిణీ చేశారు. తగరంపూడిలో శంకర్‌ఫౌండేషన్, ఓమ్ని ఆర్కే సహకారంతో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గవరపాలెం, సంతబయల వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.చేపల బజార్ రోడ్డులో అన్నదానం జరిపారు. లక్ష్మీదేవిపేటలో నిత్యావసర సరకులు అందజేశారు. సంతబయలు వద్ద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు దాడి రత్నాకర్‌కు జన్మదినశుభాకాంక్షలు తెలిపారు.

రేవుపోలవరంలో అలల ఉధృతి



తీరంలో ఎగసిపడుతున్న అలలు

ఎస్.రాయవరం : అల్పపీడన ప్రభావంతో మండలంలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రేవుపోలవరం తీరంలో సముద్ర కెరటాలు ఎగసి పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. వర్షాల ప్రభావం ఎక్కువై కెరటాలు తీవ్రత ఎక్కువైతే మత్స్యకారులు కొన్ని రోజుల పాటు చేపలవేట నిలిపి వేయాల్సి వస్తుందని వాపోతున్నారు.